
సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 99 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం | 08.08.2025



నిర్మాతలకు భరోసా..

## శ్రీలీల

4 లో



# వృక్షో రక్షతి రక్షితః

## మొక్కలకు రాఖీ కట్టిన విద్యార్థులు

అన్న, చెల్లెళ్ల అనుబంధాలకు ప్రతీకగా దేశ వ్యాప్తంగా రాఖీ పండుగ నిర్వహించుకుంటుంటే.. రాంపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మాత్రం చిన్నారులు వినూత్నంగా 'మనం చెట్లకు రక్షణ.. -చెట్లు మనకు రక్షణ' అంటూ వృక్షాలకు రాఖీలను కట్టి పండుగ చేసుకున్నారు. చేర్యాల మండలంలోని రాంపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం వేణు, ఉపాధ్యాయురాలు నందిని ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు ఒకరికొకరు గులాబి పువ్వులతో అల్లిన రాఖీలను కట్టుకున్నారు. అనంతరం విద్యార్థులు రాఖీలను చెట్లకు కట్టి 'వృక్షో రక్షతి రక్షితః' అంటూ పాఠశాల ఆవరణలో చెట్లకు రాఖీ కట్టి ప్రతిజ్ఞ నిర్వహించి శుభాకాంక్షలు తెలుపుకొని మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

- మన చౌరాస్తా, చేర్యాల



ప్రజలు కోరిన సమాచారం

## తప్పనిసరిగా ఇవ్వాలి

- రాష్ట్ర సమాచార కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి

2 లో

చేనేత ప్రాధాన్యత

## చాటాలి

- ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు
- నేత కార్మికులకు సన్మానం

3 లో





'బంజారాలకు మంత్రి

## పదవి ఇవ్వాలి'

3 లో

# జనగామలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు గురువారం జరిగాయి. ఈ పోటీలకు జనగామ కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు వచ్చే ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నాయని, 2 శాతం పొజిషన్ కూడా ఉపయోగపడుతుందని , ప్రతి ఒక్కరు విధిగా ఆటల్లో పాల్గొని శారీరక ఆరోగ్యం పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనగామ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా యంత్రాంగం సహకరించిందని ఇలాంటి కార్యక్రమాలు ముందు ముందు చేయడానికి మాకు ఇది ఒక ఉత్సాహం లాంటిదని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి బైరెడ్డి వెంకటరెడ్డి, తెలంగాణ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, తెలంగాణ క్రీడల నిర్వహణ కార్యదర్శి పగడాల వెంకటేశ్వర్ రెడ్డి, జనగామ జిల్లా అదర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్, కోశాధికారి ఆవుల అశోక్, నిర్వహణ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, కిరణ్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు సుగుణాకర్, హనుమంతరావు గజ్జెల్లి రాజు, కిష్టయ్య, గౌర్సింగ్ ఆడెపు శ్రీనివాసు, పాండ్యా, నాగరాజు, కొద్దూస్, దిలీప్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలు కోరిన సమాచారం ఇవ్వాలి

## రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :** ప్రజల కోరిన విధంగా సమాచార హక్కు చట్టం కింద సమాధానం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అంతకుముందు జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రశేఖర్ రెడ్డితో పాటు రాష్ట్ర సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, మొహిసిన పర్వీన్, బోరెడ్డి అయోధ్య రెడ్డి, వైష్ణవి మేర్లకు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ లు పూల బొకేలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. వన మహోత్సవం ను పురస్కరించుకొని మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు కోరిన విధంగా సమాచారం అందించాల్సి ఉంటుందన్నారు. ఆర్టీఐ కింద ప్రజలు కోరిన సమాచారం అందించుటలో ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన పరిచారు. సిబ్బంది ధైర్యంగా ఉండాలని ఆర్టీఐకి భయపడరాదన్నారు. జాప్యం చేస్తేనే ఇబ్బందులు ఎదురవుతాయని 30 రోజు గడువు ఉంటున్నందున ఇచ్చేందుకు కృషి చేయాలన్నారు. తక్కువ సమాచారం ఉంటే త్వరగా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమాజంలో జవాబుదారీతనం పెంచేందుకు పారదర్శకతతో పనిచేసే విధంగా సమాచార హక్కు చట్టం రూపొందించడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. అదే విధంగా మూడు నెలలకు ఆరు నెలలకు ఇచ్చే నివేదికలను నిర్ణీత సమయానికి అందజేయాలన్నారు. ప్రజలు అందించిన దరఖాస్తులు సమగ్రంగా చదివి అర్థం చేసుకోవాలని, తెలియని విషయాలను తెలుసుకోవాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.








# గానుగుపహాడ్‌లో తల్లిపాల వారోత్సవం

జనగామ రూరల్, మన చౌరాస్తా : మండలంలోని గానుగుపహాడ్ అంగన్ వాడీ సెంటర్ (I)లో గురువారం తల్లిపాల వారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రసన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఈ డాక్టర్ మహేష్, ఏఎన్ఎం శారద, అంగన్ వాడీ టీచర్ శ్రీదేవి, ఆయమ్మ మహేయాబీ, తల్లులు పాల్గొన్నారు.

# 36 దరఖాస్తుల పరిష్కారం

జిల్లాలో పర్యటించిన సమాచార కమిషనర్ అయోధ్య రెడ్డి 36 పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించారు. గురువారం సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్న వాటిని కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జనగామ ఆర్డీఓ గోపిరామ్ ఆధ్వర్యంలో సమగ్రంగా పరిశీలించి వివిధ శాఖలకు చెందిన పెండింగ్‌లో ఉన్న 36 దరఖాస్తులను పరిష్కరించారు. కార్యక్రమంలో డీఏవో అంబికా సోని, మత్స్య శాఖ అభివృద్ధి అధికారి రాణాప్రతాప్, బి.సి.అభివృద్ధి అధికారి రవీందర్, ఎస్సి అభివృద్ధి అధికారి విక్రమ్ కుమార్, ఎస్సి కార్పొరేషన్ ఈ.డి.మాధవిలత పాల్గొన్నారు.



# అధికారులు అలర్ట్‌గా ఉండాలి

## కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాలు

**జనగామ, మన చౌరాస్తా :** రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాలకు అలర్ట్‌లు జారీ చేసింది. ఇందులో భాగంగా గురువారం రాత్రి జనగామకు ఎల్లో అలర్ట్ జారీ చేయడంలో కలెక్టర్ రిజ్వాన్ వెంటనే జిల్లా అధికారులతో రాత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు అలర్ట్ గా ఉండాలని, లోతట్టు ప్రాంతల్లో ఉన్న వారిని గుర్తించి తరలించాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ప్రతి అధికారి అందుబాటులో ఉండాన్నారు.



# నాలుగేళ్లుగా కోర్టు చుట్టూ..

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో 2022 లో జనగామలో గంజాయి అమ్ముతూ విద్యార్థులను మత్తులోకి దించడానికి కొన్ని ముఠాలు ప్రయత్నం చేశాయి. ఈ గంజాయి మహమ్మారి నుంచి జనగామ విద్యార్థులను కాపాడాలని గంజాయి నిర్మూలన కోసం చేసిన ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ క్రమంలో అక్రమంగా పోలీసులు విద్యార్థి సంఘ నాయకులపై కేసులు నమోదు చేయడంతో వారు నాలుగేళ్లుగా కోర్టు చుట్టూ తిరుగుతున్నట్టు పేర్కొన్నారు. ఈ కేసులో భాగంగా గురువారం జనగామ జిల్లా కోర్టులో విద్యార్థి సంఘాల నాయకులు హాజరయ్యారు. టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు గన్ను కార్తీక్, టీజీవీపీ జిల్లా కార్యదర్శి తుంగ కౌశిక్, పట్టణ అధ్యక్షుడు వెంపటి అజయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్, ఎంఎస్ఎఫ్ అనిల్, ధీరజ్, ప్రశాంత్, అనిల్ చౌహన్, అఖిల్ మాల తదితరులు హాజరైన వారిలో ఉన్నారు.




# దివ్యాంగుడికి ట్రై సైకిల్ వితరణ

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మండలం పెంబర్తి గ్రామానికి చెందిన దివ్యాంగుడైన అవసరార్థుడు అచ్చి నర్సయ్యకు లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ పక్షాన రూ.9 వేల విలువైన ట్రై సైకిల్ కొని వితరణ చేశారు. ఇటీవల జిల్లా గవర్నర్ లయన్ డా. కె. చంద్రశేఖర్ ఆర్య జనగామ సందర్శించిన సందర్భంగా అవసరార్థుని విజ్ఞప్తి మేరకు జిల్లా గవర్నర్ సూచన ప్రకారం ఆబాద్ లయన్స్ క్లబ్ సభ్యుడు రీజియన్ చైర్మన్ లయన్ రామిని శ్రీనివాసులు ఆర్థిక సహాయం చేసి గురువారం ఉదయం వితరణ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కారంపూడి సత్యనారాయణ, కార్యదర్శి పులుగం సురేష్, రీజియన్ చైర్మన్ లయన్ రామిని శ్రీనివాసులు, పూర్వ జిల్లా గవర్నర్లు లయన్ డా. డి.లవకుమార్ రెడ్డి, లయన్ కన్న పరశురాములు, పూర్వ రీజియన్ చైర్మన్లు లయన్ కె.రాజశేఖర్ రెడ్డి, ఏ.భిక్షపతి, పూర్వ జోన్ చైర్మన్ లయన్ శ్రీబాష్యం రఘు, గ్రామ ప్రముఖులు బాల్దే సిద్దిలింగం తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థలకు జేఏసీ విజ్ఞాపన పత్రాలు

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల రెవెన్యూ డివిజన్ అంశాన్ని నేటి తరం విద్యార్థి లోకానికి వివరించి ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ అన్నారు. గురువారం చేర్యాల మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థలను కలిసి విజ్ఞాపన పత్రాన్ని అందజేసి బంద్ కు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేర్యాల ప్రాంత ఔన్నత్యాన్ని, భౌగోళిక రాజకీయ పరిస్థితులను రాబోయే తరాలకు స్ఫూర్తిని అందించడమే లక్ష్యంగా, రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను విద్యార్థులతో పాటు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తూ రెవెన్యూ డివిజన్ సాధనే లక్ష్యంగా జేఏసీ మరింత ముందుకు వెళ్తుందని తెలిపారు. 12వ తేదీన జరిగే ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల బంద్ కు అందరూ సహకరించి రెవెన్యూ డివిజన్ ఉద్యమానికి ఊపిరి అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు అందే అశోక్, అందే బీరయ్య, పోలోజు వేంకటాద్రి, గడిపే బాలనర్సయ్య, ఈరి భూమయ్య, కత్తుల భాస్కర్ రెడ్డి, నంగి కనకయ్య, పోషబోయిన పరమశేఖర్, గూడెపు సుదర్శన్, కదుదూరి పుల్లారెడ్డి, గుస్క రాందాసు, శనిగరం శ్రీనివాస్, పోనుగోటి శ్రీనివాసరెడ్డి, సత్తాల మహేష్, శెట్టె శ్రీకాంత్, దాసరి హరిబాబు నంగి సత్తయ్య, కర్రె నర్సిరెడ్డి, పుల్ల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అమరుల త్యాగాలను మరువద్దు : కేజీకేఎస్

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ఆగస్టు 2 నుంచి 18 వరకు కరీంనగర్ జిల్లాలో జరుగుతున్న అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లం కొండ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల అధ్యక్షుడు తాళ్లపల్లి మల్లయ్య గౌడ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన వారిని గుర్తు చేసుకుంటూ గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కల్లు గీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరుడైన దేశిని చిన్నమల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా నలుమూలల్లో అమరులను యాది చేసుకుంటూ సర్దార్ సర్వాయి పాపన్న జయంతి రోజు ఈ యాత్ర ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్ష గౌని సాంబయ్య పాల్గొన్నారు.



# చేనేత ప్రాధాన్యతను చాటుదాం..

### కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించి, చేనేత ప్రాధాన్యత చాటాలని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా పిలుపునిచ్చారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని చేనేత కార్మికులకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 7 న మనం జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటామని, 1905లో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమాన్ని గుర్తు చేస్తూ, ఈ రోజు భారతీయ చేనేత పరిశ్రమలో పని చేస్తున్న లక్షలాది కార్మికుల కృషికి, నైపుణ్యానికి ప్రోత్సాహం అందిస్తూ ముందుకు పోతున్నామన్నారు. భారతదేశపు చేనేత రంగం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపమని, గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా మహిళలకు ఉపాధి కల్పిస్తూ, స్వావలంభనకు మార్గం వేసే ఈ రంగం, దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మనమందరం చేనేత వస్త్రాలు ధరించి చేనేతను ప్రోత్సహించాలన్నారు. నేతన్నల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు చౌడేశ్వరి, జిల్లాలోని చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.









## సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ఈ నెల 20 నుంచి 22వరకు మేడ్చల్ జిల్లాలో జరగబోయే సీపీఐ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్ కోరారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద పార్టీ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నిరుపేదల కోసం ఏళ్ల తరబడి పోరాటం చేస్తూ ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం సీపీఐ పార్టీ కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గుడిసెలు వేసుకున్న ప్రతి ఒక్కరికి పట్టాలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మంచాల రమాదేవి, కొంగల రాంచంద్రారెడ్డి, మండల కార్యదర్శి ఆదరి రమేష్, నాయకులు సుంచు కుమారస్వామి, కిషన్, శ్రీను, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



## బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలి

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్రంలో బంజారా సమాజానికి సరైన ప్రాతినిధ్యం కల్పించాలంటూ సేవాలాల్ సేన నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జనగామ టౌన్‌లోని విజయ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు భానోత్ మహేందర్ ఆదేశాల మేరకు ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు దరావత్ శంకర్ నాయక్ అధ్యక్షత వహించారు. వివిధ మండలాల నుంచి నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో లక్షలాది మంది బంజారాలు ఉన్నా, ఇప్పటి వరకు ఒక్క మంత్రి పదవిని కూడా ఇవ్వకపోవడం దురదృష్టకరం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బంజారాల పట్ల విభేదభావంతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. తక్షణమే బంజారా సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ధరావత్ బిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రమేష్, యువజన జిల్లా అధ్యక్షుడు తేజావత్ మోహన్, రైతు సేన జిల్లా అధ్యక్షుడు మూడవత్ రాజు నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ధరావత్ ప్రకాష్, విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు అనిల్ చౌహన్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా నాయకులు అశోక్ ,భీమ్ సింగ్ తరిగపుల మండల అధ్యక్షుడు స్వభావత్ అలపతి, లింగాల ఘనపురం మండల అధ్యక్షుడు ధరావత్ రవి, తరిగొప్పుల మండల కార్యదర్శి రాజేందర్, నర్మెట మండల ఉపాధ్యక్షుడు బానోతు సుమన్, గ్రామ కమిటీ నాయకులు మోహన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ

**జనగామ టౌన్, మన చౌరాస్తా : జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి సహకారంతో మంజూరై ఇందిరమ్మ ఇంటి భూమి చేశారు. పట్టణంలోని 13వ వార్డు లబ్ధిదారులు తిప్పారపు స్వప్న, అనిల్ ఇల్లు మంజూరు కాగా గురువారం ముగ్గు పోసి ఇంటి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఉడుగుల నర్సింహులు, పట్టణ యువజన నాయకులు ఉడుగుల సాగర్ తదితరులు పాల్గొన్నారు.**

## తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుచేసుకోవాలి

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకోని ప్రతి విద్యార్థి చదువుకోవాలని భీమదేవరపల్లి ఎంపీడీవో వీరేశం అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూర్ మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ ఫ్రెషర్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నేటి రోజుల్లో విద్యార్థులు స్మార్ట్ ఫోన్కు బానిసలవుతున్నారని, అలా కాకుండా ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు శ్రద్ధగా వింటూ క్రమశిక్షణతో చదువుకుంటే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారని అన్నారు. అనంతరం నూతన జాతీయ విద్యావిధానం 2020లో భాగంగా జాతీయ స్థాయిలో బెస్ట్ ప్రాక్టీస్ టీచర్గా ములుకనూర్ మోడల్ స్కూల్ పిజిటి మాథమెటిక్స్ టీచర్ వడల అచరిత ఎంపిక కాగా ఎంపిడివో, ఉపాధ్యాయులు ఘనంగా ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటకాలు, పాటలు అకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ముజీబ్ రహమాన్, ఈవో పూర్ణచందర్, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ మాదుగుల రాజ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.





# ప్రభాస్ స్పిరిట్ కోసం ఆఫర్

అగ్ర కథానాయకుడు ప్రభాస్, దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కాంబోలో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. 'స్పిరిట్' అనే టైటిల్‌తో రాబోతున్న ఈ చిత్రం దాదాపు రూ. 300 కోట్ల బడ్జెట్‌తో రాబోతుండగా.. ఈ మూవీని టీ- సిరీస్, భద్రకాళి పిక్చర్స్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం సెప్టెంబర్ చివరిలో షూటింగ్ ప్రారంభించనుంది. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీకి సంబంధించి సాలిడ్ అప్‌డేట్‌ను వెల్లడిరచింది చిత్రబృందం. ప్రభాస్ స్పిరిట్ సినిమాలో నటించేందుకు ఆసక్తి ఉన్నవారిని డిజిటల్ ఆడిషన్స్‌కి పిలుస్తుంది చిత్రయూనిట్. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేసింది భద్రకాళీ పిక్చర్స్. ప్రభాస్ స్పిరిట్ సినిమాలో నటించేందుకు 13 నుంచి 17 ఏండ్ల వయసున్న పురుష నటులను ఆడిషన్స్‌లో పాల్గోనవచ్చని తెలిపింది. అయితే ఆడిషన్స్‌లో పాల్గోనేవారు పాత్ర కోసం తమ జుట్టు- కత్తిరించుకోవడానికి కూడా సిద్ధంగా ఉండాలని తెలిపింది. అలాగే ఒక హెడ్ షాట్ ఫోటోతో పాటు- పర్సనల్ షాట్ ఫోటో కూడా జత చేయాలని కోరారు. ఇక ఇంట్రడక్షన్ వీడియోలో మీ పేరు ఇతర వివరాలు వెల్లడిరచడంతోపాటు మీ చదువుకు సంబంధించిన వివరాలు కూడా వెల్లడిరచాలని కోరారు.



## నిర్మాతలకు భరోసా..
# శ్రీలీల

### హీరోయిన్‌గా, డ్యాన్సర్‌గా డ్యూయల్ రోల్



శ్రీలీల ఉంటే ఇక ఆ సినిమాలో స్పెషల్ సాంగ్స్ కోసం మరో భామను వెతకాల్సిన పని లేదు. ఎందుకంటే హీరోయిన్ రోల్‌కే కాదు ఐటమ్ నెంబర్‌కు ఫర్ ఫెక్ట్ ఛాయిస్‌గా మారిపోయింది. డ్యూయెట్ సాంగ్‌నైనా, ఊర మాస్ పాటైనా మేడమ్ రచ్చ రంబోలా చేయాల్సిందే. స్పెషల్ సాంగ్ కోసం స్టార్ హీరోయిన్లకు నిర్మాతలు కోట్లు వెచ్చించి తెచ్చుకునే ఛాన్స్ లేకుండా కిసిక్ బ్యూటీ డ్యూయల్ రోల్ పోషించేస్తోంది. ధమాకాలో పల్సర్ బైక్, జింతాకా అంటూ మాసీ స్టెప్పులు మొదలెట్టిన దగ్గర నుండి డ్యాన్సింగ్ క్వీన్‌గా ముద్రపడిపోయింది శ్రీలీల. ఫీమేల్ లీడ్‌గా నటిస్తే మాస్ సాంగ్ కంపల్సరీ. ఇక ఐటమ్ నంబర్ కోసం మరో భామకు తెచ్చుకోనక్కర్లేదు. ఏ టు- జెడ్ ఫెర్మామెన్స్ ఇచ్చేస్తుంది కిస్సిక్ బ్యూటీ- . యూట్యూబ్‌ను షేక్ చేయాలంటే మిస్ లీల ఉంటే చాలనేంతలా ప్రొడ్యూసర్ల మైండ్లలో ఫిక్స్ అయ్యేలా చేసింది. సినిమాపై హైప్ రావాలా, అ-టె-న్షన్ కావాలా వైరల్ వయ్యారీతో డ్యాన్స్ చేస్తే పోలా అని భావిస్తున్నారు. గుంటూరు కారంలో కుర్చీ మడత పెట్టినా, జూనియర్‌లో వైరల్ వయ్యారీగా మారినా తాను హీరోయిన్ కాని పుష్ప2లో కూడా కిస్సిక్ బ్యూటీ-గా ర్యాంపేజ్ గ్లామర్ షోతో మాస్ మహారాణిగా మారిపోయింది. ఇటు- హీరోయిన్‌గా, ఇటు- ఐటమ్ గర్ల్ గా మూవీకి వన్ ఉమెన్ షోగా మేకోవరైంది శ్రీలీల. అంటే నిర్మాతలకు డబుల్ బోనాంజాలా మారిన మేడమ్.. నెక్స్ట్ రవితేజ మూవీ మాస్ జాతరలోనూ అటు- క్లాసీ లుక్, ఇటు- మాసీ సాంగ్స్‌లో గత్తర లేపడానికి రెడీ అయ్యింది. మరోసారి ఈ జోడీ బాక్సాఫీస్ దగ్గర ధమాకా హిట్ నమోదు చేస్తుందా  చూడాలి.



# మణిరత్నం మరో లవ్‌స్టోరీ

## యువహీరో ధ్రువ్ విక్రమ్‌తో మూవీ

ప్రముఖ దర్శకుడు మణిరత్నం పేరు వినగానే అందరికీ గుర్తొచ్చేది హృదయాలను తాకే అందమైన ప్రేమ కథలు. అయితే ఇటీవల ఆయన దర్శకత్వంలో వచ్చిన 'థగ్‌లైఫ్' చిత్రం ఆశించిన స్థాయిలో ప్రేక్షకుల్ని ఆకట్టుకోలేకపోయింది. ఈ సినిమా ఫలితంగా కొంత నిరాశకు లోనైన మణిరత్నం, తన ఫేవరెట్ జోనర్ అయిన లవ్ డ్రామా వైపు మళ్లీ రీటర్న్ అవ్వడానికి సిద్ధమవుతున్నారు. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఆయన కొత్తగా తెరకెక్కించబోయే చిత్రంలో తమిళ యువ హీరో ధ్రువ్ విక్రమ్, కన్నడ బ్యూటీ- రుక్మిణి వసంత్ హీరో హీరోయిన్లుగా నటించనున్నారు. తొలిసారి స్క్రీన్ పై కలసి నటించనున్న ఈ జంట సినిమాకు హైలైట్‌గా నిలవనుందని భావిస్తున్నారు.ప్రేమ, కుటుంబ సంబంధాలు, వ్యక్తిగత సంఘర్షణలు అన్నీ కలగలిపిన ఒక భావోద్వేగ భరితమైన కథతో మణిరత్నం ఈ సినిమాను రూపొందించనున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. నవంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు  ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాకు సంగీతం అందించనున్న ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ మరో స్పెషల్ అట్రాక్షన్ కానుంది. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశముంది. మణిరత్నం గత సినిమాలకన్నా పూర్తి భిన్నంగా, కొత్త ఎనర్జీతో ఈ సినిమాను తెరకెక్కించనున్నారని తెలిసింది. కథలోని పాత్రలు, వారి మధ్య ఉన్న బంధాలు ప్రేక్షకులకు కొత్తగా అనిపించేలా మణిరత్నం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ఫిలింనగర్ వర్గాలు చెబుతున్నాయి. సుదీర్ఘ విరామం తర్వాత మణిరత్నం మళ్లీ ఓ క్లాస్ లవ్ స్టోరీతో వెండితెరపై సందడి చేయబోతుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు నెలకొన్నాయి.